స్కెచ్

# పేదకు దొరికిన పెన్నిధి

"హితశ్రీ"

సుఖజీవులకి ఉదాహరణగా ఉమాకాంతరావుని పేర్కొనవచ్చు. ఆధునిక విజ్ఞానం ఇవ్వగల సౌకర్యాలన్నీ సమకూర్చుకుని పట్టాల మీద రైలుబండిలా జీవయాత్ర గడపడానికి అలవాటుపడ్డ అతడిలో పేదసాదల దైనిక కష్ట నిష్ఠూరాలకి హృదయపూర్వకమైన సానుభూతి లోపించడం విడ్డూరం కాదు. కోటిమానవుల కష్టాలకి "పాపం" అని అతడి పెదవు లుచ్చరించకపోలేదు, కాని వెంటనే "చేసుకున్న పాపం" అని జాలికి భరతవాక్యం పలికి మరు క్షణంలో నవ్వటానికి సిద్ధంగా ఉండేవి. ఆకలి మీద అచ్చయే రచనలు చదివి ఉమాకాంతరావు అవి తిండిపోతుల ఆక్రోశాలని ఏవగించుకునే వాడు. "తిండి తప్ప మనుష్యులకి ఏమీ అక్కర్లేదా?" అని నవ్వుకునేవాడు. తిండి ఎక్కువైతే కలిగే బాధలు మాత్రమే అనుభవించిన ఉమాకాంతరావు మరోవిధంగా ఎలా భావించగలడు!

ధనవంతుడే అయినా మరింత ధనలాభం కలిగే పక్షంలో అష్టకష్టాలు పడటానికి వెనుదీయని వాళ్ళలో ఉమాకాంతరావు కూడా ఒకడు. అంచేత ధనలాభం కలిగే మార్గాలన్వేషించటంలో అతడేమీ అశ్రద్ధ వహించలేదు. భావిజీవితం కూడా గడచిన జీవితంలా సుఖమయంగా ఉంటుందా అని ఆలోచనలతో మనసు పాడుచేసుకునే ఉమాకాంతరావుతో జ్యోతిశ్శాస్త్రం తెలిసిన నాకు పరిచయమయింది. కనపడ్డప్పుడల్లా తన సంపాదన గురించీ, సౌఖ్యాన్ని గురించీ ప్రశ్నలు వేసేవాడు. మాటల సందర్భంలో సామాన్యప్రజల సమస్యలూ, శ్రామికుల కడగండ్లూ చర్చలోకి వొస్తే-"ఆఁ-అంతా అతిశయోక్తి లెండి" అని తోసిపారేసేవాడు. కనీసం నిజానిజాలు తెలుసుకునేందుకైనా ప్రయత్నించేవాడు కాదు.

ఓరోజున అతడి జాతకచక్రం చూస్తూ అన్నాను.

"మీ జీవితంలో గొప్పయోగం ఉందండీ." ఆశగా నావైపు చూశాడు ఉమాకాంతరావు.

"ఒక అమూల్యమైన వస్తువు దొరుకుతుంది మీకు."

"నిజంగానా?"

"తాటికాయంత అక్షరాలతో బ్రహ్మ రాసి పెడితే ఇంకా నిజంగానా అని అడుగుతా రేమిటి?"

"అయితే ఆ అదృష్టం ఎప్పుడు పడుతుందంటారు?"

"సరిగా ఈ వయసులోనే మీ కా భాగ్యం కలగాలి. చూడండి-మీకెప్పుడైనా కలలో నిధి నిక్షేపాల్లాంటి వేమైనా కనిపించాయా?"

"అప్పుడప్పుడు ధనపు బిందెలు దొరికినట్టుగా కల లొచ్చేవండి." సంభ్ర మాశ్చర్యాలతో నా వంక చూశాడు.

"ఇంకేం, చెప్పరేం! దొరికిం దనుకోండి, ఇంకా సందేహ మెందుకూ?"

"మా దొడ్లో మామిడిచెట్టు దగ్గర తవ్వితే ఓ పెద్ద బంగారపుబిందె దొరికినట్టు కలొచ్చిందండి ఓసారి."

"చూడండీ, నేను చెప్పినట్లు చేస్తారా?"

"ఇంకా నెమ్మదిగా అడుగుతారేం? తప్పక చేస్తాను."

"రేపు శుక్రవారంనాడు ఉపవాసం ఉండి లక్ష్మీ పూజ చేస్తారా?"

"చేస్తాను."

"రేపు మళ్ళీ కనిపిస్తాను. తర్వాత చేయాలిసిన కార్యక్రమం అంతా చెప్తాను. ఉపవాసం అక్షరాలా జరపాలి సుమండీ. పచ్చి మంచినీళ్లు తప్ప మరేం ముట్టుకోగూడదు."

"అలాగే" ఉత్సాహంగా తలూపాడు ఉమాకాంతరావు. సెలవు తీసుకుని వెళ్ళిపోయాను.

మర్నాడు సాయంత్రం వాళ్ళింటికి వెళ్లేసరికి ఉమాకాంతరావు ముఖం వేళ్ళాడేసుకుని నీరసంగా పడుకుని ఉన్నాడు. నన్ను చూడగానే "చూడండీ, కాస్త ఫలహార మేమైనా తీసికోవొచ్చా, మహా ఆకలిగా ఉంది" అన్నాడు.

"నాకేం అభ్యంతరం లేదు. కాని ఫలితం దక్కదు."

"పోనీ, కాస్త మజ్జిగైనా తీసికోకూడదూ?"

"మజ్జిగే!"

"ఎలా చెప్పండి? పేగులు దహించుకుపోతున్నాయి."

"ఎలాగో ఓపికపట్టండి ఇవాళ ఒక్కరోజు."

"సరే, తప్పేదేముంది? ముందు చేయాలిసిందేమిటో చెప్పండి."

"ఈ రాత్రికి మీ రీ ఇంట్లో పడుకోకూడదు."

"అదేమిటి, అయితే హోటల్లో రూము తీసుకోవాలా?"

"ఈరాత్రి ఒక గుడిసెలో నిద్ర చేయాలి."

"గుడిసెలో, నాకర్మం కాలితే!"

"అవును. మీ కూలివాడి గుడిసె ఉందిగా. నేలమీద పడుకోవాలి, మంచం మోయించుకెళ్లేరు!"

"ఇంతశ్రమ పడాలా దీనికోసం."

"ఉండండి. అప్పుడే ఎక్కడయింది. రాత్రి మడి ధోవతి తప్ప మరేం ధరించకూడదు. కప్పుకోటానికి ఉన్ని దుప్పటి తీసి కెడతారేమో, చిన్న ఉత్తరీయం తప్ప మరేం పైన వేసుకోకూడదు."

"ఈ చలికాలంలో దుప్పటిలేకుండా ఎలా?"

"ఏం చేస్తాం? లక్ష్మికి షరతు లెక్కువ. ఆమె అనుగ్రహం కావాలంటే ఎన్నో పాట్లు పడాలి."

"ఇంకా ఏం చేయాలి?"

"మళ్లీ రేపు ఉదయం కనిపిస్తాను. మీరు మధ్యలో వెనక్కి తగ్గితే చేసిందంతా వృథా అవుతుంది. నేను చెప్పిన అమూల్య వస్తువు దొరక్కపోవడమే కాకుండా బెడిసి కొడుతుంది. తర్వాత మీ ఇష్టం."

"ప్రవాహంలో దూకింతర్వాత ఇంకా ఆలోచించే దేముంది, ఎలాగో శ్రమపడతాను లెండి" అన్నాడు ఉత్సాహం తెచ్చుకుంటూ. నేనున్నకాసేపట్లో ఉమాకాంతరావు ఓబిందెడు మంచినీళ్లు తాగాడు పాపం, ఆకలి చంపుకోటానికి.

మర్నాడు పొద్దున్నే ఉమాకాంతరావు దగ్గరికి వెళ్ళాను. కళ్లలో ఉంది ప్రాణం అతడికి.

"చలిబాధకి ఎముకలు బిగుసుకు పోయాయండి రాత్రి" అన్నాడు జాలిగా.

"అవునవును. సరైన గుడ్డ లేకపోతే ఈ చలికాలం మహాకష్టం. ఎలాగైతేనేం, నేను చెప్పినట్టు చేశారుగా?"

"ఆహా, తూ-చా తప్పకుండా."

"అయితే భోంచేసి రండి త్వరగా, ముందు కార్యక్రమం ప్రారంభిద్దాం."

"ఇప్పుడు భోజన మేమిటి? ఎనిమిదికూడా కాలేదు. అప్పుడే తయారుకాదు."

"అరె - పోనీ నిన్నటి అన్నమేమీ మిగల్లేదూ? లైమయి పోతోందే."

"చద్దికూడు తినమంటారా?"

"ఇవాళిటి కెలాగో సర్దిపెట్టుకుందురూ."

"సరే. చివరి కేమయినా సానా ఆగచాట్లూ పడుతున్నాను."

"ఇదిగో- చూడండి- అర్ధాకలిగానే లేచి రావాలి. కడుపునిండా భోజనం చెయ్యకూడదు." ఆకలితో నకనకలాడుతున్న ఉమాకాంతరావు ఈ మాటలు విని మండిపడ్డాడు.

"బాగుంది. నిన్నల్లా ఉపోషం, ఇవాళైనా కడుపునిండా భోజనం చెయ్యకపోతే ఎలాగండీ?" కోపంగా అన్నాడు. "నన్నేం చెయ్యమంటారు, ఇదేమైనా నాకోసమా! అలా రాసిపెట్టి ఉందాయె" అన్నాను. ఉమాకాంతరావు సర్దుకుని భోజనానికి వెళ్ళి పది నిమిషాలలో తిరిగొచ్చాడు.

"సరిగా ఎనిమిదిన్నరకి మొదలుపెట్టి చీకటి పడేదాకా మీ మామిడిచెట్టు దగ్గర తవ్వాలి."

"కూలివాళ్ళని పిలిపించనా ?"

"అబ్బే. మీరు స్వయంగా త్రవ్వుకోవాలి. కష్టించిన వాళ్ళకే ఆ అమూల్యవస్తువు లభ్యమవుతుంది."

ఈసారి ఉమాకాంతరావు పూర్తిగా కుంగిపోయాడు.

"నిన్న ఉపోషం, ఇవాళ అర్థాకలి. దీనికి తోడు చలికి బిగుసుకుపోయిన ఎముకలు. ఇవి చాలక కూలిపనికూడా చేయాలిసిందే?"

"చివరిదాకా వొచ్చి వెనక్కి తిరక్కండి మరి. ఫలితం ఎంతో దగ్గరగా ఉంది. అందుకోవటమే తరవాయి."

పలుగు పుచ్చుకుని తవ్వడం ప్రారంభించాడు ఉమాకాంతరావు. నేను అప్పటికి సెలవు పుచ్చుకుని సాయంత్రం అయేసరికి మళ్లీ వొచ్చాను. ఉమాకాంతరావు తవ్వుతూనే ఉన్నాడు. చెమటలు దిగజారిపోతున్నాయి. దీనంగా ఉన్నాడు.

"దొరికిందా?" అన్నాను.

"మట్టి దొరికింది. నాప్రాణం పోతోంది." అన్నాడు.

"నిజంగా దొరకలేదా?"

"అయితే నేనబద్ధం చెబుతున్నాననా మీరనేది?"

"అదికాదు. ఈపాటికి దొరికిఉండవలసిందే."

"నే నిహ తవ్వలేను. దొరక్కపోతే దాని పీడాపోయిరి, కూలివాళ్ళెలా తవ్వుతారోగాని!"

"దొరికింది. దొరికింది." అన్నాను నేను ఉత్సాహంగా.

"ఏమిటి, ఎక్కడ?" సంభ్రమంగా అన్నాడు ఉమాకాంతరావు.

"అమూల్య వస్తువు దొరికింది. మీ శ్రమ ఫలించింది." ఉమాకాంతరావు చుట్టూ చూశాడు. ఏమీ కనబడలేదు.

"నాకేమీ కనపడటంలేదు. మీకు పిచ్చెత్తలేదుగద?"

"అది కంటికి కనపడదు. అయినా అమూల్యమైంది."

"ఓయి భగవంతుడా, పిచ్చెత్తవలసింది నాకయితే మీకు పిచ్చెత్తటమేమిటి, కర్మ."

"పిచ్చికాదు. మీ జీవితంలో అమూల్యమైన వస్తువు సంపాదించుకున్నారు."

"ఏమిటది?"

"హృదయం."

"హృదయం?"

"అవును. ఏక్షణంలో మీరు సానుభూతి ప్రదర్శించారో ఆక్షణంలో మీలో అమూల్యమైన హృదయం ప్రతిష్ఠితమైంది. ఆకలి బాధ ఎలా ఉంటుందో అనుభవపూర్వకంగా గ్రహించారు. ఉండటానికి యిల్లూ, కట్టటానికి సరైన బట్టా లేనివాళ్ల బాధ అనుభవించారు. అర్థాకలితో అలమటించే వాళ్ల కష్టాలు తెలుసుకోగలిగారు. చివరికి సత్తువకార్చే చెమట విలువ తెలుసుకోగలిగారు. ఇవి ఏనాడైతే మీరు అనుభవించారో ఆనాడే అమూల్య హృదయాన్ని మీరు సంపాదించుకున్నారు. మనిషికి మానవత్వం కన్నా గొప్ప గుణమేమీ లేదు. ఆ మానవత్వం ప్రసాదించగల హృదయం అమూల్యమైంది కాదా?"

ఉద్రేకంతో నానుంచి వెలువడ్డ ఈమాటలు ఉమాకాంతరావులో చలనం కలిగించాయి. అనిమేషంగా చూశాడు నావైపు. తర్వాత "కృతజ్ఞుణ్ని" అన్నాడు. ఉమాకాంతరావు జీవితంలో మరో అధ్యాయం, అతి ముఖ్యమైన అధ్యాయం, ప్రారంభమైంది ఆరోజే.

